క్లుప్తంగా

నేడు మాజీ సైనికులకు సన్మానం

మదనపల్లె : భారత 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సైనిక్‌భవన్‌లో మాజీ సైనికులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని అసోసియేషన్ మాజీ సైనికుల అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక పత్రికాప్రకటనలో తెలిపారు. దేశరక్షణలో సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ పట్టణంలోని సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ మేనేజర్ లోకేష్ బాబు మాజీ సైనికులు, కుటుంబసభ్యులను సన్మానిస్తారన్నారు. కార్యక్రమానికి మాజీ సైనిక సంఘ సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

మదనపల్లె : మదనపల్లె కోర్టు ఆవరణలో ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు రెండో అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.భాస్కరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజీకి వీలున్న క్రిమినల్, పరిహారం, మోటార్ యాక్సిడెంట్, మనీ చెక్కు బౌన్స్ కేసులను జాతీయలోక్ అదాలత్‌తో పరిష్కరించుకుని రాజమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కేసులు పరిష్కరించుకోవాలని కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం మంజూరు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని నవాబుకోట పంచాయతీ గుగ్గిళ్ళపల్లికి చెందిన పూజారి నంజుండు (41) బుధవారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును మృతుడి భార్య భాగ్యమ్మకు స్థానిక సర్పంచ్ అనసూయమ్మ, నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సీవీ రమణల సమక్షంలో అందజేశారు.

కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి



పీలేరు సహాయ కార్మిక సంక్షేమ అధికారి ఆనందబాబు

పీలేరు : కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలని పీలేరు సహాయ కార్మిక సంక్షేమ అధికారి ఆనంద బాబు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పీలేరు, కేవీపల్లె, ఎర్రావారిపాళెం, రొంపిచెర్ల, సదుం, సోమల, తవణంపల్లె, ఐరాల మండలాలకు చెందిన వైఎస్సార్‌బీమా కింద నమోదు అయిన కార్మికులు, ఉపాధి హామీ కూలీలు కార్మిక సంక్షేమ కార్యాలయంలో గుర్తింపు కార్డులు పొందాలన్నారు. గుర్తింపు కార్డులు కలిగిన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. వివరాలకు 9492555228లో సంప్రదించాలన్నారు.

వేలంలో రూ.2.42 లక్షల ఆదాయం

నిమ్మనపల్లె : చేపల చెరువుల వేలంపాట ద్వారా సామకోటవారిపల్లె పంచాయతీకి రూ.2,42,500 ఆదాయం సమకూరినట్లు ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. బుధవారం సామకోటవారిపల్లె సచివాలయంలో 12 చెరువులకు ఆరునెలల కాలపరిమితితో చేపలు పట్టుకునేందుకు సర్పంచ్ మహదేవరెడ్డి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. కార్యక్రమానికి సింగిల్‌విండో ఛైర్మన్ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వేలంలో పొట్టిచెరువును అత్యధికంగా రూ.93వేలకు తరిగొండవారిపల్లెకు చెందిన టి.రెడ్డెప్పరెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దయాకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి, క్లస్టర్ కార్యదర్శి మంజుల, సచివాలయ కార్యదర్శి నాగమల్లి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత దాడులు

కలికిరి : మండల పరిధిలో పోలీసులు దాడులు నిర్వహించి పట్టణ పరిధిలో పేకాట ఆడుతున్న వారిని, అలాగే మహల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. పట్టణంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2850 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే మహల్‌లో ప్రభుత్వ మద్యం అక్రమంగా నిల్వవుంచి విక్రయిస్తున్నట్లు గుర్తించి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిపబ్లిక్ డే సందర్భంగా అంబేడ్కర్ నాటిక ప్రదర్శన

మదనపల్లె : రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ జీవితచరిత్రపై రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' నృత్య,గేయ నాటికను రిపబ్లిక్ డే సందర్భంగా ప్రదర్శిస్తున్నట్లు భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ తెలిపారు. బాస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 7 గంటలకు పట్టణంలోని జేసీఎం ఫంక్షన్ హాల్‌లో జరిగే అంబేడ్కర్ నాటక ప్రదర్శనకు ముఖ్యఅతిథులుగా ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, డీఎస్పీ కేశప్ప, విశిష్ఠ అతిథిగా సహాయసాంఘిక సంక్షేమ అధికారి శ్రీరాములునాయక్, జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, పట్టణ ప్రముఖులు హాజరవుతారన్నారు. నాటిక ప్రదర్శనను పట్టణ ప్రజలందరూ తిలకించి విజయవంతం చేయాలని కోరారు.

ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యానికి పండుగ రోజు

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- ఓటు నమోదు నిరంతర ప్రక్రియ
- ఆధార్ అనుసంధానంతో బోగస్ ఓట్లకు చెక్
- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



తంబళ్లపల్లె: మానవహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి చైర్‌పర్సన్ మనూజారెడ్డి



వాల్మీకిపురం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె : అర్హులైన ఓటర్లందరూ ఓటుహక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన పండుగ రోజని, ఆ దిశగా ప్రజలను చైతన్యపరచడమే ఓటర్ల దినోత్సవం ముఖ్య ఉద్దేశమని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రస్తుతం చేస్తున్న ఓటుకు ఆధార్ అనుసంధానంతో బోగస్ ఓట్లు తొలగిపోతాయన్నారు. సీనియర్ సిటిజన్స్ రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ సహదేవ్‌రావు, రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.సీ.వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ రెడ్డెప్ప, ఎస్.ఏ.జబ్బార్, జి.కమలమ్మ, పి.మధుసూధన్‌లను సన్మానించారు.

గుర్రంకొండ : మండలకేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ నుంచి కళాశాల విద్యార్థులతో ప్రారంభమైన ర్యాలీ బస్టాండు వరకు సాగింది. సీనియర్ ఓటర్లకు సన్మానం చేశారు. తహసీల్దార్ ఖాజాబీ, ఆర్‌ఐ చంద్రశేఖర్, ఏఎస్‌వో ప్రసాద్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : స్థానిక బస్టాండ్‌లో బుధవారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహమూద్, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చంద్రశేఖర్, తహశీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓ నారాయణ, ఆర్‌ఐ అనీషా, వీఆర్వో లలితమ్మ పాల్గొన్నారు.

పెద్దమండ్యం : సమాజ శ్రేయస్సు ఓటరు చేతిలోనే ఉందని ఎస్‌ఐ పి. వెంకటేష్ అన్నారు. బుధవారం కలిచెర్ల, పెద్దమండ్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మోడల్ పాఠశాల నుండి బస్టాండు వరకు పురవీధులలో అధికారులు, మోడల్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ నిర్మలాదేవి, ప్రిన్సిపల్ రామాంజులునాయక్ పాల్గొన్నారు.

కేవీపల్లె : మండలంలోని వగళ్ల కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రెడ్డిబాషా మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రావణి, అధ్యాపకులు జోత్స్న, శైలజ, అన్నపూర్ణ, రాధ, ఇందిరమ్మ, రెడ్డెమ్మ, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : వయోజనులంతా ఓటు హక్కు కలిగి ఉండాలని హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గపు ఎన్నికల అధికారి కె. గోపాలకృష్ణ అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ రవి, ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి, సీఐ మోహన్ రెడ్డి, డీటీ కిరణ్, ఆర్‌ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : జాతీయ ఓటరు దినోత్సవాన్ని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్ సీ.ఆర్.మంజుల ఓటరు ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం అడుసుపల్లె, అగ్రహారం గ్రామాలకు చెందిన సీనియర్ సిటిజన్స్ రామచంద్రారెడ్డి, కృష్ణప్పలను సన్మానించారు.

కురబలకోట : ఓటు ప్రతి పౌరుడి హక్కు అని ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. మండలంలోని అంగళ్లలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ మాస్టర్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : ఓటుహక్కు వజ్రాయుధంతో సమానమని తహసీల్దార్ కళావతి అన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు హరిత సెంటర్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ త్యాగరాజు, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్, ఆర్‌ఐ రవి, హెచ్‌ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

కలకడ : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీపీ శ్రీదేవి, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ నారాయణ అన్నారు. బుధవారం ఓటరు దినోత్సవం పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

ములకలచెరువు : మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం, సోంపల్లి సచివాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు, అధ్యాపకులు, సచివాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వృద్ధాప ఓటర్లను ఘనంగా సన్మానించారు.

వాల్మీకిపురం : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఉన్న అందరూ ఓటును వినియోగించుకోవాలని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాల నందు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రాఘవ రెడ్డి, సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలోని జూనియర్ కళాశాల, స్థానిక తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలోఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ వివిశాస్త్రీ , జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, మాట్లాడుతూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బి కొత్తకోట: ఓటు వజ్రాయుధం అని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. బుధవారం కొత్తకోటలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ ధ్యేయం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్టీసీ అధికారులు

పీలేరు రూరల్ : ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ ధ్యేయమని డీఎం కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గిఫ్ట్ స్కీమ్ డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు డిపో పరిధిలో పీలేరు – సుండుపల్లె, సోమల – కలకడ మార్గంలో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీమ్ డ్రా తీసినట్లు తెలిపారు. మొదటి బహుమతి పీలేరుకు చెందిన కె. ఉషా దక్కించుకోగా, ద్వితీయ బహుమతి సుండుపల్లెకు చెందిన ప్రతిమ, తృతీయ బహుమతి పీలేరుకు చెందిన ఎస్.వి. రమణకు లభించింది.అలాగే కలకడ – సోమల మార్గంలో ప్రథమ బహుమతి కలికిరికి చెందిన పుష్పకుమార్, ద్వితీయ బహుమతి కలికిరికి చెందిన బాషాసాహెబ్, తృతీయ బహుమతి కలికిరికి చెందిన మల్లికార్జునరెడ్డి దక్కించుకున్నారు. పీలేరు పట్టణానికి చెందిన మౌర్య కంటి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మౌర్యరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ ధనుంజయకులు, ఎస్టీఐ సుధాకర్‌నాయక్, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, ఏడీసీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యం



చెత్తబుట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్యసేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. క్లాప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ టౌన్ హాల్‌లో డస్ట్‌బిన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌నూర్‌ఆజం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పట్టణ ప్రజలు ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఆహ్లాదంగా గడపాలన్నదే క్లాప్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే అందరికీ ఆరోగ్యం సాధ్యపడుతుందన్నారు. ప్రజల సహకారం, భాగస్వామ్యం లేనిదే ఏ కార్యక్రమం విజయవంతం కాదని, స్వచ్ఛ మదనపల్లెకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ..పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కావాల్సిన అన్ని చర్యలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ కే.ప్రమీల మాట్లాడుతూ..నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ సమర్థవంతంగా అమలులో భాగంగా చెత్తను వేరుచేసేందుకు డస్ట్‌బిన్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. పట్టణంలోని 35వార్డులను 359 మైక్రోపాకెట్స్‌గా విభజించి ప్రతి పాకెట్‌కు ఇంటింటి చెత్తసేకరణకు ఇద్దరు పారిశుధ్య కార్మికులను నియమిస్తున్నామన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ బండపల్లిశిరీషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మెప్మా ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.


కల్పవృక్ష వాహనంపై శ్రీవారు



కల్పవృక్ష వాహనంపై స్వామివారి ఊరేగింపు

తంబళ్లపల్లె : కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అర్చకులు క్రిష్ణప్రసాద్‌బట్టార్, రాఘవేంద్రస్వామి, రమేష్ బాబులు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ స్వామి వారిని కల్ప వృక్ష, సింహవానంపై కనువిందు కలిగేలా ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ రెడ్డిభాస్కర్, సూపరింటెండెంట్ మునిచంగల్‌రాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా గోపాలకృష్ణ



బాధ్యతలు స్వీకరించిన గోపాలకృష్ణ

పీలేరు రూరల్ : హంద్రీనీవా సుజల స్రవంతి యూనిట్ –2 పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాల్‌కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న చిన్నరాముడు బదిలీపై విజయవాడకు వెళ్లారు. ఆయన స్థానంలో పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లో తహసీల్దార్‌గా పని చేస్తున్న గోపాలకృష్ణ పీలేరుకు పదోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.









భూ హక్కు పత్రాలను సద్వినియోగం చేసుకోవాలి



భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గుర్రంకొండ : భూహక్కు పత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఖాజాబీ, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్ అన్నారు. బుధవారం మండలంలోని టి.రాచపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా 420 మంది రైతులకు కొత్తగా మంజూరైన భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన భూహక్కు పత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన ఈ పాస్‌పుస్తకాల కంటే కూడా భుహక్కు పత్రాలకు విలువ ఎక్కువ అన్నారు. ఇందులో రైతుల పొలాలకు సంబంధించిన మ్యాప్‌లతో సహా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు నారదరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఆర్‌ఐ చంద్రశేఖర్, సర్పంచ్ రాధలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు



ఉచిత విద్యుత్ మీటర్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ సురేష్‌కుమార్, హౌసింగ్ డీఈ గోపాల్‌నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని కంకర ఫ్యాక్టరీ లేఅవుట్, ఆయిల్‌సీడ్స్ లేఅవుట్‌లో పలు ఇళ్లకు కొత్త మీటర్లు బిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు మీటర్లకు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా బోర్డుతో కూడిన మీటరు, సర్వీసు వైరు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ సుధాకర్, ఏఈలు రామ్మూర్తి, ఇలాహి, బాలాజీనాయక్, ఎం. మహేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జంతువుల సంక్షేమం మన బాధ్యత

కలకడ : జంతువుల సంక్షేమం మన అందరి బాధ్యత అని జిల్లా పశువైద్యశాల సంచాలకులు డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. బుధవారం జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని గంగాపురం పంచాయతీ కత్తివారిపల్లె, బాలయ్యగారిపల్లె పంచాయతీలోని యర్రయ్యగారిపల్లె పశువైద్యశాలను తనిఖీ చేశారు. అలాగే రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. జంతు హింస చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులునాయుడు, డాక్టర్ తేజకళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు

తంబళ్లపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ మణికుమార్ తెలిపారు. బుధవారం తిమ్మయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ , షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీఎంఓఓ కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



